సాక్షి విశాఖపట్నం

సోమవారం । 15 । ఏప్రిల్ । 2024



చదువుతోనే భవిష్యత్

విద్యార్థుల చదువుతో పాటు సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున వెల్లడించారు. 8లో



అంబేడ్కర్ ఎందరికో స్ఫూర్తి

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు జిల్లాలో వాడవాడలా ఘనంగా జరిగాయి. 8లో



నీటి బొట్టు.. ఒడిసి పట్టు

ప్రతీ నీటి బొట్టును ఒడిసి పట్టుకోవాలని మధురవాడ ఎంవీవీ సిటీ వాకర్స్ అసోసియేషన్ పిలుపునిచ్చింది. 8లో

న్యూస్‌రీల్

సీఎం జగన్‌తోనే మరింత అభివృద్ధి



బొత్స ఝాన్సీ, వాసుపల్లికి స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

కంచరపాలెం : పేదలకు మరింత అభివృద్ధి జరిగి, సంక్షేమం అందాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వల్లే సాధ్యమని విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. నగరంలోని 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటేనే బడుగుల బతుకులు బాగుంటాయని బొత్స ఝాన్సీ అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు ద్రోణంరాజు శ్రీవత్సవ్, వార్డు నాయకులు వేళంగిణీరావు, కుమార్, శ్రీను, లక్ష్మి, దేవి, ఈశ్వరి, కల్యాణ్, ప్రభాత్, ఆనంద్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం



జెండా ఊపి వారోత్సవాలు ప్రారంభిస్తున్న సీపీ రవిశంకర్, ప్రాంతీయాధికారి నిరంజన్ రెడ్డి

మహారాణిపేట: జిల్లాలో జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. సూర్యాభాగ్ అగ్నిమాపక కేంద్రంలో నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ వారోత్సవాలను ప్రారంభించి.. అగ్నిమాపక సిబ్బంది సేవలను కొనియాడారు. ముందుగా విధి నిర్వహణలో మరణించిన అగ్నిమాపక శాఖ సిబ్బందికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కరపత్రాలు, బ్యానర్లు, పోస్టర్లను ఆవిష్కరించారు. అగ్నిమాపక శాఖ ప్రాంతీయ అధికారి డి.నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ పోటీలతో పాటు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లా అగ్నిమాపకశాఖాధికారి ఎస్.రేణుకయ్య, సహాయ అధికారులు పి.సింహాచలం, కె.వి.టి.ప్రసాద్, ఎస్.గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సభకు కూటమి మిత్రుల డుమ్మా

- బీజేపీ జిల్లా నాయకుల గైర్హాజరు
- కనిపించని జనసేన స్థానిక నాయకులు



గాజువాక : టీడీపీ అధినేత చంద్రబాబు గాజువాకలో నిర్వహించిన ప్రజాగళం సభలో తన కూటమి పార్టీల నాయకుల జాడ కనిపించలేదు. గాజువాకలో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. గత ఐదేళ్ల కాలంలో బలం కోల్పోయిన టీడీపీ ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే కారణంతో బీజేపీ, జనసేన పార్టీలతో పొత్తు కుదుర్చుకున్న విషయం తెలిసిందే. రాష్ట్ర నాయకుల మధ్య సయోధ్య ఎలా ఉన్నా క్షేత్రస్థాయిలో వారి మధ్య సమన్వయం లేదన్న విషయాన్ని గాజువాక సభ మరోసారి స్పష్టం చేసింది. ఈ సభకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సహా జిల్లా కార్యవర్గంలోని సీనియర్ నాయకులు హాజరు కాలేదు. ఆ పార్టీ గాజువాక కో ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు, స్థానికంగా ఉండే కొద్దిమంది కార్యకర్తలు హాజరయ్యారు. జనసేన నుంచి కూడా ముఖ్యనాయకులు కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. ఆ పార్టీ పీఏసీ సభ్యుడు కోన తాతారావు ఒక్కరే వేదికపై కనిపించారు. సభ ప్రాంగణంలో కూడా ఒకరిద్దరు తప్ప మిగిలిన నాయకులెవ్వరూ కనిపించలేదు.

జనం అంతంత మాత్రమే.. : పాతగాజువాకలోని 60 అడుగుల రోడ్‌లో ఏర్పాటు చేసిన చంద్రబాబు సభను విజయవంతం చేసేందుకు టీడీపీ నాయకులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. జనం అంతంత మాత్రంగానే కనిపించారు. రోడ్డు ఇరుకుగా ఉన్నప్పటికీ జనం పలుచగా కనిపించడం ఆ పార్టీ నాయకులను నిరాశకు గురి చేసింది. చంద్రబాబు ప్రసంగించేందుకు ఏర్పాటు చేసిన వేదికతో రోడ్డు మరింత ఇరుకుగా మారింది. సభా ప్రాంగణంలోకి జనం వెళ్లి రావడానికి కేవలం మూడు, నాలుగు అడుగుల దారి మాత్రమే ఉండటంతో అవస్థలు తప్పని పరిస్థితి చోటుచేసుకుంది. పాతగాజువాక నుంచి రాత్రి 9 గంటల సమయంలో విమానాశ్రయానికి చేరుకొని ప్రత్యేక విమానంలో బేగంపేట బయలుదేరి వెళ్లారు.

పెల్లుబికిన ప్రజాగ్రహం



మర్రిపాలెం వుడా లేఅవుట్ పార్టీ కార్యాలయం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, పార్టీ నాయకులు



లాసన్స్ బే కాలనీలోని కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు కోలా గురువులు, పార్టీ ముఖ్య నేతలు



తాటిచెట్లపాలెం సుందర అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో కొబ్బరికాయలు కొడుతున్న ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె. రాజు, వి.కె.పి.సి.పి.ఐ.ఆర్ చైర్మన్ చొక్కాకుల వెంకట్రావు, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, పార్టీ నాయకులు



మధురవాడ వుడా కాలనీ గాంధీ విగ్రహం వద్ద నల్ల రిబ్బన్లు ధరించి నిరసన చేపడుతున్న జీవీఎంసీ 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం కార్యవర్గ సభ్యురాలు ముదుండి రాజేశ్వరి తదితరులు



గాజువాకలో రోడ్డుపై బైఠాయించిన వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, గాజువాక అదనపు పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి తదితరులు

- సీఎం జగన్‌పై దాడిని ముక్తకంఠంతో ఖండన
- ఊరూవాడా నిరసనలు, ఆందోళనలు
- ఆలయాలు, మసీదులు, చర్చిల్లో సర్వమత ప్రార్థనలు
- దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విజయవాడలో జరిగిన హత్యాయత్నం ఘటనపై ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆగ్రహ జ్వాలలు రగిలాయి. ఆదివారం పలు ప్రాంతాల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు వివిధ రూపాల్లో నిరసనలకు దిగారు. జగన్‌పై హత్యాయత్నానికి నిరసనగా అనేక చోట్ల రాస్తారోకోలు, మానవహారాలు, ధర్నాలు నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మరికొన్ని ప్రాంతాల్లోని దేవాలయాలు, మసీదులు, చర్చిల్లో సర్వమత ప్రార్థనలు చేసి సీఎం జగన్ గాయం నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జగన్‌పై హత్యాయత్నానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని పెద్ద ఎత్తున డిమాండ్ చేశారు. ఈ కుట్రలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పాత్ర ఉందని ఆరోపించారు. చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినదించారు.

ఉలిక్కిపడ్డ 'విశాఖ'

- ఐదున్నరేళ్ల క్రితం విమానాశ్రయంలో..
- ఇప్పుడు విజయవాడ నడిబొడ్డులో..
- వైఎస్ జగన్‌పై హత్యాయత్నం
- కలవరానికి గురైన విశాఖ వాసులు

విశాఖ ఉలిక్కి పడింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం జరిగిందన్న వార్త తెలిసి ఉమ్మడి విశాఖ విలవిల్లాడింది. మేము సిద్ధం కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి విజయవాడలో రోడ్ షో నిర్వహిస్తున్న సీఎం జగన్‌పై టీడీపీ గుండాలు హత్యాయత్నానికి పాల్పడడం కలవరపాటుకు గురి చేసింది. వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు, పార్టీ నేతలు, ప్రజలు ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆందోళనతో అర్ధరాత్రి దాటే వరకూ టీవీలను వీక్షిస్తూనే ఉన్నారు. సీఎం జగన్ దాడి నుంచి తృటిలో తప్పించుకున్నారని, ప్రాణాపాయం లేదని నిర్ధారించుకున్నాక ఊపిరి పీల్చుకున్నారు. 2018 అక్టోబర్ 25న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విశాఖపట్నం విమానాశ్రయంలో హత్యాయత్నం జరిగిన ఘటనను ఇప్పుడు ఉమ్మడి విశాఖ ప్రజలు మరోసారి గుర్తు చేసుకుంటున్నారు. అప్పట్లో ఆయన్ని అంతం చేసే కుట్రలో భాగంగా హత్యాయత్నం జరిగింది. తరువాత సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయాన్ని సాధించగా.. ఈ ఐదేళ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి, అనేక సంక్షేమ పథకాలతో జన రంజక పాలనను అందిస్తున్నారు. ఈ ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ విజయ దుందుభి మోగించడం ఖాయమంటూ ఊరూవాడా కోడై కూస్తోంది. వివిధ సర్వేలూ అదే విషయాన్ని చెబుతున్నాయి. ఈ తరుణంలో విజయవాడ ఎన్నికల ప్రచారంలో ఉన్న జగన్‌పై మరోసారి హత్యాయత్నానికి ఒడిగట్టడం పెను సంచలనమైంది. వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావడం తథ్యమని తేటతెల్లం కావడంతో కుట్రలో భాగంగానే ఆయన్ను హతమార్చాలని ప్రతిపక్షాలు పన్నాగం పన్నాయన్న భావన మెజార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

పార్టీ కార్యాలయం వద్ద మౌనదీక్ష



పార్టీ కార్యాలయం వద్ద నల్ల బాడ్జీలతో నిరసన తెలుపుతున్న మేయర్ హరివెంకట కుమారి, వివిధ విభాగాల అధ్యక్షులు, నాయకులు

కొమ్మాది: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడిని ఖండిస్తూ ఎండాడలో గల వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయం వద్ద పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్సీ రవీంద్రబాబు ఆధ్వర్యంలో మౌన దీక్ష నిర్వహించారు. నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలియజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకుల కుట్రలో భాగంగా ఈ దాడి జరిగిందని.. వచ్చే ఎన్నికల్లో వారికి ఓటు ద్వారా ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు కృపాజ్యోతి, వుడా మాజీ చైర్మన్ రవి, మహిళా వైస్ ప్రెసిడెంట్ పేడాడ రమణకుమారి, స్టేట్ జనరల్ సెక్రటరీలు యువశ్రీ, రాజేశ్వరి, వివిధ విభాగాల కార్పొరేషన్ చైర్మన్లు జాన్ వెస్లీ, పేర్ల విజయ్ చందర్, కొండా రాజీవ్, పోతిన శ్రీను, నగర కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిల్లా సుజాత సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ జగ్గపల్లి అప్పలరాజు, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రాజాబాబు, మర్రి రాజశేఖర్, బోని శివరామకృష్ణ, వానపల్లి ఈశ్వర్‌రావు, మైనారిటీ అధ్యక్షుడు బాబా, వంకాయల మారుతి ప్రసాద్, అప్పన్న, మల్లేశ్వరి, జానీ, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

టీడీపీ కార్పొరేటర్‌పై జనసేన నేత దాడి

- బండారు వర్గమైన 88వ వార్డు కార్పొరేటర్ ముత్యాలనాయుడిని దూషిస్తున్న జనసేన నేత గల్ల శ్రీనివాసరావు
- ఆదివారం ఓ విందులో జనం చూస్తుండగా చితకబాదిన శ్రీను
- పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కార్పొరేటర్ అనుచరుడు

పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గంలో జనసేన నాయకులు.. తెలుగుదేశం పార్టీ నాయకులపై ఆధిపత్య పోరు చెలాయించేందుకు ఏకంగా రౌడీయిజానికే దిగుతున్నారు. ముఖ్యంగా టీడీపీ సీనియర్ నేత బండారు సత్యనారాయణమూర్తి వర్గాన్ని టార్గెట్ చేస్తూ భౌతిక దాడులకు దిగుతున్నారు. తాజాగా తెలుగుదేశం పార్టీ 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడుపై అదే వార్డుకు చెందిన జనసేన నేత, కూటమి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు అనుచరుడు గల్ల శ్రీనివాసరావు దాడికి తెగబడ్డాడు. ఓ ఫంక్షన్‌లో అందరూ చూస్తుండగా చితకబాదాడు. దీనిపై బాధితుడు ముత్యాలనాయుడు అనుచరుడు శ్రీను పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ ఎల్.రామకృష్ణ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆధిపత్యం కోసం ఆరాటం

రెండేళ్ల కిందట జరిగిన జీవీఎంసీ ఎన్నికల్లో టీడీపీలో ఉన్న గల్లా శ్రీను, కార్పొరేటర్ ముత్యాలనాయుడు కలిసి పనిచేశారు. ఆ ఎన్నికల్లో ముత్యాలనాయుడు కోసం గల్ల శ్రీను భారీ స్థాయిలో నగదు ఖర్చు చేశాడు. అనంతరం ముత్యాలనాయుడు కార్పొరేటర్‌గా గెలిచారు. అయితే కొద్ది రోజులకే ఇరువురి మధ్య ఆధిపత్య పోరు ప్రారంభమైంది. ఈ క్రమంలో సార్వత్రిక ఎన్నికల్లో పెందుర్తి అసెంబ్లీ టికెట్ జనసేన నుంచి పంచకర్ల రమేష్‌బాబుకు కేటాయించడంతో గల్ల శ్రీను జనసేనలో చేరిపోయాడు. అదే సమయంలో బండారుకు టికెట్ నిరాకరించడంతో కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు పంచకర్లతో కలిసేందుకు ఆసక్తి చూపలేదు. దీంతో నెల రోజులుగా గల్ల శ్రీను.. బండారు, మొల్లి ముత్యాలనాయుడు, టీడీపీ నాయకులపై సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పిస్తూ పోస్టులు పెడుతున్నాడు.

అందరి ముందు చితకబాదాడు

ఆదివారం 88వ వార్డు సతివానిపాలెంలో జరిగిన ఓ విందుకు కార్పొరేటర్ ముత్యాలనాయుడు, గల్ల శ్రీను వేర్వేరుగా హాజరయ్యారు. ఇద్దరూ పరస్పరం ఎదురుపడడంతో తొలుత మాటల యుద్ధం జరిగింది. ఇరువురు ఒకరిపై ఒకరు చెయ్యి చేసుకున్నారు. దీంతో మరింత రెచ్చిపోయిన గల్ల శ్రీను.. ముత్యాలనాయుడును చితకబాదాడు. పక్కనే ఉన్న అనుచరులు ఓ.శ్రీను, తదితరులు నిలువరిచేందుకు ప్రయత్నించినా మరింత ఆవేశంతో జనసేన నేత రెచ్చిపోయాడు. దీనిపై ముత్యాలనాయుడు అనుచరుడు ఓ.శ్రీను పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రగిలిపోతున్న యాదవ సామాజికవర్గం

యాదవ సామాజికవర్గానికి చెందిన మొల్లి ముత్యాలనాయుడుపై జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు దాడికి తెగబడడంతో ముత్యాలనాయుడు అనుచరులు రగిలిపోతున్నారు. తమ సామాజికవర్గానికి చెందిన నేతను అందరిముందు అత్యంత దారుణంగా కొట్టడంపై మండిపడుతున్నారు. ఇంకా ఎన్నికలు జరగకముందే జనసైనికులు ఇలా ఇష్టానుసారం రౌడీయిజం చేస్తూ రెచ్చిపోవడం పట్ల సర్వత్రా ఆగ్రహం పెల్లుబికుతుంది. ముఖ్యంగా యాదవ సామాజికవర్గంతో పాటు టీడీపీ కేడర్ జనసేన నేత తీరుపట్ల తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం జగన్ సహనాన్ని పరీక్షించొద్దు

- ప్రజాసైన్యం మా వెంటే ఉంది
- రెడ్డి సామాజిక వర్గ ఆత్మీయ కలయికలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన మాజీ కార్పొరేటర్ పామేటి బాబ్జీ



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు తదితరులు

మద్దిలపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి చేయడం అమానుషమని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. సీఎం సహనాన్ని పరీక్షించవద్దని, ప్రజా సైన్యం తమ వెంటే ఉందన్నారు. బిర్లా జంక్షన్ దరి బొత్స స్క్వేర్ ఫంక్షన్ హాలులో ఆదివారం రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో విశాఖ పార్లమెంట్ పరిధి రెడ్డి సామాజిక వర్గ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయనతోపాటు విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, విశాఖ ఉత్తర, భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థులు కె.కె.రాజు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి హాజరయ్యారు. ముందుగా అతిథులు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పాలనని చూసి ఓర్వలేక.. ఆయనపై రాళ్ల దాడికి పాల్పడడం దారుణమన్నారు. ఐదేళ్లలో రూ.3 లక్షల 70 కోట్లతో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి.. 1.25 కోట్ల కుటుంబాలను ఆదుకుని అండగా నిలిచిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు.

సీఎం జగన్‌పై దాడి హేయమైన చర్య

సీఎం జగన్‌పై రాళ్లతో దాడి చేయడం హేయమైన చర్య అని విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మి అన్నారు. నిర్భయానికి, నిక్కచ్చికి మారుపేరు రెడ్డి కులస్తులన్న ఆమె, మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి.. రెడ్డి సామాజికవర్గానికి వన్నె తెచ్చారని గుర్తు చేశారు. కూటమికి ఓటుతోనే బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ముత్తంశెట్టి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల మత రాజకీయాలు అతీతమన్నారు. సచివాలయాలు స్థాపించి చరిత్ర సృష్టించారని, మళ్లీ జగన్ ముఖ్యమంత్రి అయితేనే ప్రజా సంక్షేమం కొనసాగుతుందన్నారు. కె.కె.రాజు మాట్లాడుతూ కుట్రలు కుతంత్రాలు చేసే వారికి ఎన్నికల్లో ఓటుతోనే గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రజల హృదయాల్లో దేవుడిలా జగన్ నిలిచారని, అటువంటి వ్యక్తిపై రాళ్ల దాడి చేసి గాయపరచడం దారుణమన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ పనిచేశారని.. సంక్షేమం విషయంలో వెనుకడుగు వేయని ముఖ్యమంత్రిగా గుర్తింపు పొందారన్నారు.

పార్టీలో చేరిన మాజీ కార్పొరేటర్

కార్యక్రమంలో భాగంగా పాత 46వ వార్డు మాజీ కార్పొరేటర్ పామేటి బాబ్జీ, టీడీపీ నాయకుడు తిక్కాడ చిన్న, పలువురు రెడ్డి సామాజికవర్గ సభ్యులు వై.వి.సుబ్బారెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. అనంతరం వీరంతా బిర్లా జంక్షన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీకేపీసీపీఐఆర్ చైర్మన్, ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి, ఏపీఏ కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, పెద్ద ఎత్తున రెడ్డి సామాజిక వర్గ ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

- జగన్ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయి
- వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి
- గంటా ఏమైనా స్వాతంత్ర్య సమరయోధుడా...: బొత్స విమర్శ







మజ్జివలస సభలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, చిత్రంలో బొత్స ఝాన్సీ, ముత్తంశెట్టి, హాజరైన జనం

తగరపువలస: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకుని.. సంక్షేమ, అభివృద్ధి పథకాలను కొనసాగించుకుందామని వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. భీమిలి మండలం మజ్జివలసలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలు, మూడు పోర్టులు, 15 వేల సచివాలయాలు, 10 వేల రైతు భరోసా కేంద్రాలు, ప్రతి గ్రామంలో క్లినిక్‌లు సీఎం జగన్ ద్వారానే సాధ్యమయ్యాయన్నారు. భీమిలిలో మత్స్యకారులకు ఫిష్‌పాండ్ నిర్మించనున్నట్లు తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఆరులైన్ల రహదారుల వల్ల భీమిలి అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ఐదేళ్లలో భీమిలి ఎంత అభివృద్ధి చెందిందో చూసి.. మరోమారు సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఎందరో శ్రీనివాసులు వస్తారని.. ప్రజల మధ్య ఉండేది ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాత్రమేనన్నారు. మే 13 తర్వాత గంటా శ్రీనివాసరావు మరి కనపించడన్నారు. ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. మండలంలో 16 మంది సర్పంచ్‌లలో ఒకరు వెళ్లినంత మాత్రాన వచ్చే నష్టం ఏమీ లేదన్నారు. గతంలో ప్రజలకు 600 హామీలు ఇచ్చిన చంద్రబాబు ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ వెనుకబడిన ఉత్తరాంధ్ర నినాదం పోవాలంటే మళ్లీ వైఎస్ జగన్ సీఎం కావాలన్నారు. చీపురుపల్లి, నెల్లిమర్ల, భీమిలి నియోజకవర్గాలు ఎంచుకోవడానికి గంటా స్వాతంత్ర సమరయోధుడు కాదన్నారు. బ్యాంకుల నుంచి అప్పులుగా తెచ్చిన డబ్బులతో ఎక్కడైనా గెలవగలననే అహంకారం గంటాదన్నారు. డబ్బు, మద్యంతో గెలవాలనుకుంటున్న గంటాను ఈసారి ఎన్నికల్లో కూకటివేళ్లతో పెకలించి వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

గంటాకు ఓటమి రుచి చూపిస్తా..

భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ భీమిలి మండలంలో రూ.300 కోట్లతో 7 స్టార్ హోటల్ నిర్మిస్తున్న సీఎం జగన్‌కు.. ఇక్కడి ప్రజలంటే ఎనలేని ప్రేమ అన్నారు. భీమిలి నుంచే సిద్ధం సభ ద్వారా ఎన్నికల శంఖారావం పూరించారన్నారు. గంటా మాయలో ఎవరూ పడవద్దని, ఈ సారి రెట్టింపు మెజారిటీతో గంటాపై గెలిచి ఆయనకు ఓటమి రుచి చూపిస్తానన్నారు. ధర్మానికి, నీతికి ప్రతినిధి అయిన తాను అవినీతి గంటాకు భయపడేది లేదన్నారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి భరత్ వద్ద ఆ పార్టీ నేతలకు కూడా ప్రవేశం ఉండదన్నారు. వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూ ఎటువంటి అవినీతి లేకుండా.. రాష్ట్ర ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రజాక్షేత్రంలో జగన్‌తో తలపడలేక దొడ్డిదారిన చంద్రబాబు భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జగన్ సీఎం అయితే భీమిలిలోనే 150 వరకు ప్రభుత్వ కార్యాలయాలు వచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, నియోజకవర్గ పరిశీలకుడు పి.బాలరాజు, వ్యవసాయశాఖ జిల్లా సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, ఎంపీపీలు దంతులూరి వాసురాజు, కె.రాంబాబు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సచివాలయాల కన్వీనర్ సరగడ రఘునాథరెడ్డి, కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలు, జిల్లా కార్యదర్శులు జీరు వెంకటరెడ్డి, మద్దిల వెంకటరమణ, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు వంకాయల మారుతీప్రసాద్, నగరాల కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, చిల్ల హరి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు చెల్లూరి పైడప్పడు, తుపాకుల ఆదిలక్ష్మి, శిరిగుడి సంతోషి, సమ్మిడి శ్రీనివాసరావు, చెల్లూరి నగేష్, కేపీ సత్యనారాయణ, ముద్దాడ అప్పయ్యమ్మ, దుంపల నాగమణి, పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు, వెంపాడ సూరిబాబు, బొడ్డు దుర్గారావు, మేరుగు ఎల్లాజీ, బోనిల సన్నిబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్‌ సీపీలో భారీగా చేరికలు

● గాజువాక


మిందిలో మంత్రి అమర్‌నాథ్‌ సమక్షంలో వైఎస్సార్‌ సీపీలో చేరిన ప్రభాస్‌, అల్లుఅర్జున్‌ ఫ్యాన్స్‌

అక్కిరెడ్డిపాలెం: సివిల్‌ సప్లై కార్పొరేషన్‌ డైరెక్టర్‌ మొల్లి చిన్న ఆధ్వర్యంలో 200 మంది ప్రభాస్‌, అల్లు అర్జున్‌ ఫ్యాన్స్‌ వైఎస్సార్‌ సీపీలో చేరారు. జీవీఎంసీ 68వ వార్డు మిందిలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఫ్యాన్స్‌ గంగాధర్‌, చరణ్‌, సురేష్‌, కిరణ్‌, కల్యాణ్‌, శ్రీనివాసరావు, అశోక్‌, శ్రీకాంత్‌, ప్రవీణ్‌, త్రినాథ్‌రావు, రమణమూర్తి, శంకర్‌, దేవుడు, అప్పారావు, కనకరాజు పాల్గొన్నారు.

● విశాఖ పశ్చిమ

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డుకు చెందిన టీడీపీ సీనియర్‌ నాయకుడు బర్రి సూర్యప్రకాష్‌ ఆదివారం వైఎస్సార్‌ సీపీలో చేరారు. నక్కవానిపాలెంలోని క్యాంప్‌ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సూర్యప్రకాష్‌తో పాటు ఆయన అనుచరులకు పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్‌ మాట్లాడుతూ పశ్చిమలో గణబాబు గెలుపు కోసం సొంత డబ్బులు ఖర్చు చేసి కార్యక్రమాలు నిర్వహించానని తెలిపారు. జీవితాంతం జెండాలు మోయడం తప్పించి తనకు సరైన గుర్తింపు ఇవ్వలేదన్నారు. గణబాబు ఎవరినీ ఎదగనివ్వడని, ఆయన వెంట ఉన్న సీనియర్‌ నాయకులు ఈ విషయాన్ని గుర్తించి.. బయటకు రావాలన్నారు. ఆనంద్‌కుమార్‌ కార్యకర్తల పట్ల చూపుతున్న అభిమానానికి కృతజ్ఞుడినై.. వైఎస్సార్‌సీపీలో చేరినట్లు చెప్పారు. జగన్‌ వంటి ముఖ్యమంత్రి ఈ రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. 58వ వార్డు అధ్యక్షుడు దాట్ల శ్రీనివాసరాజు, వ్యవసాయ మార్కెటింగ్‌ బోర్డు డైరెక్టర్‌ చుక్క వరలక్ష్మి, తోనంగి వెంకటరమణి, అంగ వర్మ పాల్గొన్నారు.


సూర్యప్రకాష్‌కు కండువా కప్పుతున్న ఆడారి ఆనంద్‌కుమార్‌

● భీమిలి


పార్టీలో చేరిన వారికి కండువా వేస్తున్న ఎంపీ వైవీ సుబ్బారెడ్డి

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలసలో ఆదివారం జరిగిన సభలో చిప్పాడ, లక్ష్మీపురం, శింగనబంధకు చెందిన పలువురు టీడీపీ నాయకులు వైఎస్సార్‌ సీపీలో చేరారు. పార్టీ రీజినల్‌ కో–ఆర్డినేటర్‌ వైవీ సుబ్బారెడ్డి, రీజినల్‌ యూత్‌ కో–ఆర్డినేటర్‌ ముత్తంశెట్టి శివనందీష్‌, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ముఖ్యంగా నీలాతి రమణ, అతని అనుచరులు వంద మంది వరకు ఉన్నారు.

సీఎం జగన్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా..

● రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ


మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

సాక్షి, విశాఖపట్నం: సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. లాసన్స్‌బేకాలనీలోని వైఎస్సార్‌ సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'పథకం ప్రకారమే ఆగంతకుడు ప్రణాళికను సిద్ధం చేసుకున్నాడనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బస్సు యాత్ర సాగే మార్గంలో విద్యుత్‌ సరఫరా నిలిపేస్తుండటాన్ని ఆసరాగా చేసుకుని దాడి చేశాడు. సీఎం పక్కకు తిరిగి ఉండకపోయి ఉంటే ఎడమ కన్నుకు తగిలి ఉండేది.' అని బొత్స అన్నారు.. బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. అనంతరం విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా విశాఖలో వాల్తేరు క్లబ్‌ బ్రిటిష్‌ కాలం నుంచి ఉందన్నారు. అది ఓ కమ్యూనిటీ ఆధిపత్యంలో ఉందనడం సరికాదని, అందులో కమ్మ, రెడ్డి, క్షత్రియ, కాపు, వెలమ, యాదవ, గవరతో పాటు అన్ని కులస్తులు ఉన్నారన్నారు. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉన్నంత వరకు వాల్తేరు క్లబ్‌కు ఎటువంటి ఢోకా ఉండదని, క్లబ్‌కు రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు.

గంటా మందు, విందు రాజకీయం

తగరపువలస: భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు ప్రతినిధులు ఆదివారం రాత్రి ఎంపిక చేసిన కొందరికి కొమ్మాదికి సమీపంలోని అన్నంరాజు లే అవుట్‌ వద్ద మందు, విందు ఏర్పాటు చేశారు. ఇందులో కొందరు పాత్రికేయులు కూడా ఉన్నట్టు తెలిసింది. తాగిన వారికి తాగినంత.. తిన్నవారికి తిన్నంతగా భారీ ఏర్పాట్లు చేశారు. దీనికి గంటా బంధువు జీవన్‌ ప్రాతినిథ్యం వహించినట్టు తెలిసింది. సకల మర్యాదలు జరగ్గా.. ఆతిథ్యం స్వీకరించిన వారు తాగి తందనాలు ఆడారు. వీరి చేష్టలతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అంబేడ్కర్‌ ఆలోచనలు ఎందరికో స్ఫూర్తి


కలెక్టరేట్‌లో అంబేడ్కర్‌ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్‌ మల్లికార్జున


దాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


అంబేడ్కర్‌ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ బాబూరావు, మేయర్‌ హరివెంకట కుమారి, వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ముఖ్య నేతలు

దాబాగార్డెన్స్‌: రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. దాబాగార్డెన్స్‌ వద్ద ఉన్న అంబేడ్కర్‌ విగ్రహానికి ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్‌ సీపీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ కొండా రాజీవ్‌ గాంధీ, వీఎంఆర్‌డీఏ చైర్మన్‌ సనపల చంద్రమౌళి, మైనార్టీ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ బొల్లవరపు జాన్‌వెస్లీ, పార్టీ అదనపు కార్యదర్శి గుడిమెట్ల రవిరెడ్డి, పేడాడ రమణికుమారి, యువశ్రీ, పలువురు పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అంబేడ్కర్‌ అడుగుజాడల్లో పాలన సాగించారని తెలిపారు. బీజేపీ, టీడీపీ, బీఆర్‌ఎస్‌, సీపీఐ, సీపీఎం, పలు సంఘాల నాయకులు అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పోరాటయోధుడు అంబేడ్కర్‌

కొమ్మాది: బలహీన వర్గాలు, దళితుల సంక్షేమం కోసం పోరాడిన యోధుడు, భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్‌. అంబేడ్కర్‌ అని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు అన్నారు. ఎండాడలోని వైఎస్సార్‌ సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం అంబేడ్కర్‌ జయంతి వేడుకల్లో మేయర్‌ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్సీ రవీంద్రబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులతో కలసి ఆయన పాల్గొన్నారు. ముందుగా అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ అంబేడ్కర్‌లోని నాయకత్వ లక్షణాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్సీ సెల్‌ విభాగం అధ్యక్షుడు బోని శివరామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు జాన్‌వెస్లీ, పేర్ల విజయ్‌చందర్‌, కొండా రాజీవ్‌గాంధీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, పేడాడ రమణికుమారి, వివిధ విభాగాల అధ్యక్షులు కృపాజ్యోతి, కె.వి.బాబా, జగ్గంపిల్లి అప్పలరాజు, అల్లంపల్లి రాజబాబు, వంకాయల మారుతీప్రసాద్‌, షరీఫ్‌, రవి, పిల్లా సుజాత సత్యనారాయణ, యువశ్రీ, ముదుండు రాజేశ్వరి, మల్లేశ్వరి, నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

మహారాణిపేట: కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో ఆదివారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బి.ఆర్‌.అంబేడ్కర్‌ చిత్రపటానికి కలెక్టర్‌ ఎ.మల్లికార్జున పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజానికి అంబేడ్కర్‌ అందించిన సేవలను స్మరించుకున్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్‌, ఆర్డీవోలు హుస్సేన్‌ సాహెబ్‌, భాస్కరరెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

మహనీయుడు అంబేడ్కర్‌

బీచ్‌రోడ్డు: దేశంలో అసమానతలను రూపుమాపేందుకు జీవితమంతా పోరాడిన మహనీయుడు అంబేడ్కర్‌ అని వైఎస్సార్‌ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి అన్నారు. అంబేడ్కర్‌ జయంతి సందర్భంగా ఆదివారం రామ్‌నగర్‌లోని అంబేడ్కర్‌ విగ్రహానికి మేయర్‌ గొలగాని హరివెంకట కుమారి, తూర్పు అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణతో కలసి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. జీవీఎంసీ 28వ వార్డు కార్పొరేటర్‌ పల్లా అప్పలకొండ, వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ ఆశయ సాధనకు కృషి చేయాలి

విశాఖ లీగల్‌: భారతరత్న డాక్టర్‌ బి.ఆర్‌.అంబేడ్కర్‌ ఆశయ సాధనకు న్యాయవాదులందరూ కృషి చేయాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి చీమలపాటి రవి అన్నారు. అంబేడ్కర్‌ జయంతి సందర్భంగా ఆదివారం జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత జస్టిస్‌ రవి అంబేడ్కర్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ న్యాయవ్యవస్థకు అంబేడ్కర్‌ అందించిన సేవలను విశ్లేషించారు. విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్‌ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంబేడ్కర్‌ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవర సత్యనారాయణ, రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌ ఉపాధ్యక్షుడు ఎస్‌. కృష్ణమోహన్‌, న్యాయవాదుల సంఘం కార్యదర్శి డి.నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్నహైకోర్టు న్యాయమూర్తి చీమలపాటి రవి, చిత్రంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గిరిధర్‌

విజ్ఞాన ఘని బాబా సాహెబ్‌


అంబేడ్కర్‌ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జీవీఎంసీ కమిషనర్‌, అదనపు కమిషనర్లు

దాబాగార్డెన్స్‌: భారతరత్న డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ విజ్ఞానఘని అని జీవీఎంసీ కమిషనర్‌ సాయికాంత్‌ వర్మ అన్నారు. జీవీఎంసీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో అదనపు కమిషనర్‌ కె.ఎస్‌.విశ్వనాథన్‌తో కలిసి అంబేడ్కర్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదనపు కమిషనర్లు డాక్టర్‌ వై.శ్రీనివాసరావు, ఎస్‌ఎస్‌ వర్మ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్‌ నరేష్‌ కుమార్‌, ఎగ్జామినర్‌ ఆఫ్‌ అకౌంట్స్‌ వాసుదేవరెడ్డి, జీవీఎంసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్‌ అసోసియేషన్‌ సభ్యులు వై.మూర్తి, బాబూరావు, చంద్రశేఖర్‌, వెంకటలక్ష్మి, కాకర్ల శ్రీను, సుధాకర్‌, గణపతి పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్‌

● వసతి గృహాల్లో మౌలిక సౌకర్యాల పెంపు
● కలెక్టర్‌ డాక్టర్‌ మల్లికార్జున

విశాఖ విద్య : విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు కలెక్టర్‌ డాక్టర్‌ మల్లికార్జున వెల్లడించారు. ఎంవీపీలో గల గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహం, చినగదిలి సాంఘిక సంక్షేమ వసతి గృహాలను సీఎస్‌ఆర్‌ నిధులతో అభివృద్ధి చేసిన నేపథ్యంలో ఆదివారం ఆయా వసతి గృహ విద్యార్థులతో ముచ్చటించారు. 'విశాఖ విద్యా వసతి వికాసం' పేరిట సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు పెంపొందించేలా కలెక్టర్‌ సీఎస్‌ఆర్‌ నిధులు మంజూరు చేశారు. జిల్లాలోని 6 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, 5 బీసీ వెల్ఫేర్‌ హాస్టళ్లను సుమారుగా రూ.4.77 కోట్లుతో ఆధునీకరించారు. అభివృద్ధి చేసిన వసతి గృహాలు విద్యార్థులకు ఎలా సద్వినియోగం అవుతున్నాయనేది నేరుగా తెలుసుకునేందుకు ఆయా హాస్టళ్లను సందర్శించారు. విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. విద్యార్థులతో పాటు కింద కూర్చొని వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. వసతి గృహాల్లో సౌకర్యాలు ఎలా ఉన్నాయని, చదువులు ఎలా సాగుతున్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు చినగదిలి సాంఘిక సంక్షేమ వసతి గృహ ప్రాంగణంలో ఉన్న అంబేడ్కర్‌ విగ్రహానికి కలెక్టర్‌ డాక్టర్‌ మల్లికార్జున పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్‌ కే.రామారావు, సమగ్ర శిక్ష ఈఈ నరసింహారావు, వసతి గృహ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించండి

● షిప్‌యార్డ్‌ను రక్షించాలని నాడు లోక్‌సభలో ప్రస్తావించిన బొత్స ఝాన్సీలక్ష్మి



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీ లక్ష్మి ఉన్నత విద్యావంతురాలు. 2006లో బొబ్బిలి లోక్‌సభ సభ్యురాలిగా, 2009లో విజయనగరం ఎంపీగా గెలుపొందారు. ప్రస్తుత ఎన్నికల్లో విశాఖ ఎంపీగా పోటీ చేస్తున్న ఆమె.. 2009లోనే 'విశాఖ విజన్‌' పేరిట నగర అభివృద్ధిపై ఆమె పార్లమెంట్‌లో పలు అంశాలు ప్రస్తావించారు. అధికార పార్టీ ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మి 2008లో ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించాలని లోక్‌సభలో కోరారు. ఎంతో చరిత్ర ఉన్న షిప్‌యార్డు నష్టాల్లో కూరుకుపోయిందని, వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని డిమాండ్‌ చేశారు. కార్మికులకు 50 శాతం డీఏ చెల్లించాలని, రక్షణ రంగ నిర్మాణ పనులను తక్షణమే విశాఖ షిప్‌యార్డుకు కేటాయించి 5,100 మంది కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఆమె ప్రసంగాన్ని తలలు పండిన కమ్యూనిస్టు ఎంపీలు సైతం ఆసక్తిగా గమనించారు. మహానేత వైఎస్‌ రాజశేఖరరెడ్డి సూచనలతో విశాఖ నగరానికి మెట్రో లైన్‌ వేయాలని, భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మించాలనే అంశాలను సైతం ఆమె లోకసభలో ప్రస్తావించారు.

నోబెల్‌ వరల్డ్‌ రికార్డ్స్‌లో మాస్టర్‌ అగస్త్యకు చోటు


మంత్రి అమర్‌నాథ్‌ నుంచి మెడల్‌, సర్టిఫికెట్‌ను అందుకుంటున్న మాస్టర్‌ అగస్త్య బజాజ్‌

అక్కిరెడ్డిపాలెం: 16 నెలల వయసులోనే పుస్తకాలను గుర్తు పట్టి.. వాటిలో పదాలను పలకడం, వస్తువులను గుర్తించడంలో నగరానికి చెందిన అగస్త్య బజాజ్‌ నోబెల్‌ వరల్డ్‌ రికార్డ్స్‌లో స్థానం పొందాడు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ మిందిలోని తన నివాసంలో ఆదివారం బాలుడితో పాటు అతని తల్లిదండ్రులు అగస్త్య రవికుమార్‌ బజాజ్‌, సాక్షి బజాజ్‌లను అభినందించారు. అతి చిన్న వయసులోనే బాలుడి ప్రతిభ అద్భుతమని కొనియాడారు. బాలుడు తాతయ్య రాకేష్‌ కుమార్‌ బజాజ్‌, నాన్నమ్మ అల్పన బజాజ్‌, 72వ వార్డు వైఎస్సార్‌ సీపీ ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

కూటమి ప్రచారంలో స్టీల్‌ ప్లాంట్‌ ఉద్యోగి


జీవీఎంసీ 94వ వార్డు టీడీపీ-జనసేన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న స్టీల్‌ ప్లాంట్‌ ఉద్యోగి బొబ్బర ముత్యాలు(చుక్కల తెల్ల చొక్కా)

పెందుర్తి: ఎన్నికల్లో గెలుపు కోసం టీడీపీ,జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు అడ్డదారులు తొక్కడమే కాదు.. ఎన్నికల నియమావళిని సైతం లెక్క చేయడం లేదు. ముఖ్యంగా పెందుర్తిలో కూటమి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు అనుచరులకు ఎన్నికల కోడ్‌ అంటేనే లెక్క లేనట్లు ప్రవర్తిస్తున్నారు. జీవీఎంసీ 94వ వార్డు వేపగుంట ప్రాంతానికి చెందిన స్టీల్‌ ప్లాంట్‌ ఉద్యోగి బొబ్బర ముత్యాలు ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం వివాదాస్పదంగా మారింది. గత రెండు రోజులుగా స్థానిక కూటమి నాయకుల ఆధ్వర్యంలో పంచకర్ల రమేష్‌కు మద్దతుగా జరుగుతున్న ప్రచారంలో బొబ్బర ముత్యాలు పాల్గొంటున్నాడు. దీనిపై సమగ్ర విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కోరుతున్నారు.

ముత్యాల తలంబ్రాలు అందజేత


రాంబాబుకు ముత్యాల తలంబ్రాలు అందజేస్తున్న పోదేశ్వర్‌ పురోహిత్‌

దాబాగార్డెన్స్‌: కనకమహాలక్ష్మి దత్తత దేవాలయం అంబికాబాగ్‌ సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఈ నెల 17న నిర్వహించనున్న సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఉపయోగించే ముత్యాల తలంబ్రాలు ఆంధ్రప్రదేశ్‌ ప్రాదేశిక మార్వాడీ సమ్మేళన్‌ రాష్ట్ర కార్యదర్శి పోదేశ్వర్‌ పురోహిత్‌ (బసంత్‌ ఆప్టికల్స్‌) దంపతులు ఆదివారం కేజీ ముత్యాలు అందజేశారు. అలాగే నగరానికి చెందిన లక్ష్మీ శ్రీబాల వెంకటరమణబాబు, వెంకటరమణ దంపతులు అరకేజీ ముత్యాలు ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వి.రాంబాబుకు అందజేశారు.

కారు బోల్తా పడి యువకుడి మృతి


కారులో గాయపడి మృతి చెందిన సురేష్‌

కె.కోటపాడు : సూదివలస జంక్షన్‌ సమీపంలో శనివారం అర్ధరాత్రి కారు అదుపుతప్పి పల్టీలు కొట్టిన ఘటనలో కారులో ప్రయాణిస్తున్న బోకం సురేష్‌(33) సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుడు సురేష్‌ భార్య ఆమని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కె.కోటపాడు ఎస్‌.ఐ లక్ష్మీనారాయణ కేసును నమోదు చేశారు. ప్రమాదంపై ఎస్‌.ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలివి. సబ్బవరం మండలం గుల్లేపల్లి గ్రామానికి చెందిన మృతుడు బోకం సురేష్‌, లోకిరెడ్డి అప్పలరాజు కారులో కె.కోటపాడు వైపు బంధువుల ఇంటికి బయలుదేరారు. కారు సూదివలస కూడలి వద్దకు చేరుకునే సరికి అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొని పల్టీ కొట్టింది. ఈ ఘటనలో కారులో పక్కన కూర్చున్న సురేష్‌ తలకు తీవ్ర గాయమై సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. కారు డ్రైవింగ్‌ చేస్తున్న అప్పలరాజుకు గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు సురేష్‌ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్టు ఎస్‌ఐ లక్ష్మీ నారాయణ తెలిపారు.

నీటి బొట్టు.. ఒడిసి పట్టు


పోటీకి హాజరైన చిన్నారులతో ఎంవీవీ సిటీ అసోసియేషన్‌ ప్రతినిధులు

● ఎంవీవీ సిటీలో నీటి సంరక్షణపై అవగాహన

మధురవాడ: ప్రతీ నీటి బొట్టును ఒడిసి పట్టుకోవాలని మధురవాడ ఎంవీవీ సిటీ వాకర్స్‌ అసోసియేషన్‌ పిలుపునిచ్చింది. దేశంలోని అనేక నగరాల్లో వస్తున్న నీటి కొరతను గమనించిన అసోసియేషన్‌ ప్రతినిధులు అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు 1,428 ఫ్లాట్లలోని నాలుగు వేల జనాభా ఉన్న గేటెడ్‌ కమ్యూనిటీలో పెద్దలకు అవగాహన సదస్సు, చిన్నారులకు సేవ్‌ వాటర్‌ అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 89 మంది చిన్నారులు హాజరై.. నీటి సంరక్షణపై చక్కని బొమ్మలు వేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సుస్మాధావన్‌, విష్ణుప్రియ, పూర్ణిమ వ్యవహరించారు. అసోసియేషన్‌ అధ్యక్షుడు కాంద్రేగుల సత్యప్రసాద్‌, ప్రతినిధులు బాబు కాంతారావు, రామ్‌ కుమార్‌, శశిభూషన్‌, అన్నాజీరావు, అప్పలరాజు, రెడ్డి అప్పలనాయుడు, పి.బాపారావు తదితరులు విజేతలకు బహుమతులు అందించారు. ఎంవీవీ సిటీ కార్యదర్శి సురేష్‌ పెద్దిరెడ్డి, ఉపాధ్యక్షుడు వంశీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో ఎంవీవీ సిటీ నివాసితులు పాల్గొన్నారు.

అమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు


క్యూలైన్లు పరిశీలిస్తున్న దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్‌ ఎస్‌.సుజాత, ఈవో బండారు ప్రసాద్‌

అనకాపల్లి : గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కొత్త అమావాస్య జాతర తొలి ఆదివారం కావడంతో ఉమ్మడి విశాఖ జిల్లాల నుంచి అధికసంఖ్యలో భక్తులు వచ్చి, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వంటలు చేసుకుని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలు స్వచ్ఛంద సేవాసంస్థల సభ్యులు ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత మజ్జిగ, తాగునీరు, అమ్మవారి ప్రసాద వితరణ చేపట్టారు. పట్టణ, ట్రాఫిక్‌ సీఐలు జి.శంకరరావు, పైడపునాయుడు ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్‌ ఎస్‌.సుజాత, ఈవో బండారు ప్రసాద్‌ ఏర్పాట్లు పర్యవేక్షించారు.